క్లుప్తంగా

బీజేపీ నేతల మొక్కల పంపిణీ



మొక్క అందజేస్తున్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మొక్కలు పంపిణీ చేశామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ చెప్పారు. పట్టణంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటి ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రమేశ్‌గౌడ్, కవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): రేగోడ్‌లోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశాడు. 16 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 52వేలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పాడు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, నాయకులు ఈశ్వరప్ప, కృష్ణ, రాములు, శంకరప్ప, దేవేందర్, నాగిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్‌కు చెందిన రాజుకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ అందించారు. వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి రూ.3 లక్షల విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం కార్యదర్శిగా సిద్దిరాములు



సిద్దిరాములును అభినందిస్తున్న దేవన్న

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌కు చెందిన సిద్దిరాములు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు.

తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



కౌడిపల్లి రైతువేదికలో రైతుభరోసా కార్యక్రమానికి హాజరైన సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా నిధులను రైతులకు అందచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లి రైతువేదికలో మంగళవారం రైతుభరోసా సంబరాల సమావేశానికి సుహాసినిరెడ్డి, కౌడిపల్లి డివిజన్ ఏడీఏ పుణ్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ సాహితి, గౌతమి, నరేందర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. దీంతోపాటు మహమ్మద్‌నగర్, తునికి రైతువేదికలలో ఏఈఓలు సృజన, సౌజన్య రైతులు హాజరయ్యారు.

రామాయంపేటలో సంబరాలు

రామాయంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు రైతు బరోసా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- భయం భయంగా చదువులు
- 60 ఏళ్ల క్రితం నిర్మాణం
- రెండుసార్లు నిధులు మంజూరై వెనక్కి



కూలిపోయిన తరగతి గది

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు ప్రచారం చేస్తున్నారు. కానీ సౌకర్యాలు దేవుడెరుగు పాఠశాల ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు జంకుతున్నారు. ఆరు దశాబ్దల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. సిమెంట్ రేకులు పగిలిపోయాయి. పైకప్పు శ్లాబ్ పెచ్చులుడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. వర్షం పడితే తరగతి గదుల్లో నీరు చేరుతుండటంతో విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతుంది.

మండలంలోని గడిపెద్దాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. గతంలో మూడు వందల మందికి పైగానే విద్యార్థులు విద్యనభ్యసించేవారు. నేడు 200 మంది మాత్రమే చదవాల్సిన దుస్థితి. 1964లో నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నాలుగు తరగతి గదులు మాత్రమే బాగున్నాయి. రేకుల షెడ్డుతో భవనం నిర్మించారు. పక్కనే మరో గది నిర్మించగా శిథిలమైంది. మరో రేకుల షెడ్డు గది పూర్తిగా కూలిపోయింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

నిధులు వెనక్కి..

గతంలో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. కానీ ఈ నిధులు చాలవని కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి కింద రూ.కోటి నిధులు మంజూరైనా నిర్మించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో నిధులు ల్యాప్స్ అయ్యాయి.



తరగతి గదిలో రేకులకు రంధ్రాలు పడిన దృశ్యం

శిథిలమైన భవనంలో బిక్కు బిక్కు మంటూ విద్యార్థులు చదువుకోవల్సిన పరిస్థితి నెలకొంది.

బిక్కుబిక్కుమంటూ..



ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఎప్పుడు ఏమవుతుందోనని బిక్కుబిక్కు మంటూ చదువులు సాగిస్తున్నాం.

– శివకుమార్ విద్యార్థి, గడిపెద్దాపూర్

కొత్త భవనం నిర్మించాలి



ప్రభుత్వాలు ఎన్ని మారినా పాఠశాల భవనం గురించి పట్టించుకోవడం లేదు.అధికారులు సైతం తమకేమి పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు జరిగే వరకు పట్టించుకోరేమో. కలెక్టర్ స్పందించి కొత్త భవనం నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి.

–మేఘన, విద్యార్థిని, గడిపెద్దాపూర్

బస్సులో సీటు కోసం మహిళల గొడవ

- లొల్లి భరించలేక బస్సును పోలీస్‌స్టేషన్‌కు తెచ్చిన డ్రైవర్
- నచ్చజెప్పి పంపిన పోలీసులు



కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌వద్ద ప్రయాణికులకు నచ్చజెబుతున్న పోలీసులు

కౌడిపల్లి(నర్సాపూర్): సీటు కోసం మహిళలు గొడవ పడగా డ్రైవర్ భరించలేక బస్సులో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు... బోధన్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్‌కు వెళ్తోంది. కాగా మెదక్‌లో కొంతమంది మహిళలు, పిల్లలు బస్సు ఎక్కారు. అక్కడ సీటుకోసం మహిళల మధ్య గొడవ జరిగింది. డ్రైవర్, కండక్టర్‌తోపాటు ప్రయాణికులు గొడవ చేయవద్దని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో డ్రైవర్ కౌడిపల్లి దాటిన తరువాత గొడవ భరించలేక యూటర్న్ తీసుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. కాగా పోలీసులు ప్రయాణికులు గొడవ పడవద్దని ఇద్దరికి నచ్చజెప్పి పంపించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యాపారస్తులు, హోటల్ యజమానులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పాదచారులకు దారి లేకుండా చేశారని, వాటిని తొలగించాలని గ్రామస్తులు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కరీముల్లాకు వినతి పత్రం అందచేశారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో మాజీ వార్డుసభ్యులు తిరుమలేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావ్, లక్ష్మణ్, నాసర్‌ఖాన్, మల్లేశ్, సుధాకర్, మక్బుల్, తదితరులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కాగా ఎంపీడీఓ శ్రీనివాస్ కౌడిపల్లిలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణ దారులకు నోటీసులిచ్చి తొలగించాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశంను ఆదేశించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రాజేందర్

నర్సాపూర్: కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మాజీ సర్పంచ్ రాజేందర్ మంగళవారం ఆర్‌డీఓ మహిపాల్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని కౌడిపల్లికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు సభ్యులకు ఎలాంటి పంచనామా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంటు కమిటీ మూడు సార్లు భూమిని కేటాయించారని ఆరోపించారు. ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలని కౌడిపల్లి రెవెన్యూ అధికారులను కోరినా ప్రయోజనం లేదని వాపోయారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

యాదవులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

రామాయంపేట(మెదక్): మంత్రివర్గంలో యాదవులకు చోటు కల్పించకపోవడం శోచనీయమని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన యాదవ ఆత్మగౌరవ మహాసభ పోస్టర్లను మంగళవారం రామాయంపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. దామాషా ప్రకారం యాదవులకు నామనేటెడ్ పోస్టులు మంజూరు చేయాలని, మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం గతంలో ఇచ్చిన హామీ మేరకు యాదవ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ. పది కోట్ల కార్పస్ ఫండ్ కేటాయించాలన్నారు. సంఘం నాయకులు పూలపల్లి యాదవ్, బసన్నపల్లి రాజు, తాడెం మల్లయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



టేక్మాల్‌లో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

టేక్మాల్(మెదక్): పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ విఠల్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రోజూ ట్రాక్టర్ల ద్వారా తడిచెత్త, పొడిచెత్త సేకరణ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కాలనీల్లో వీధిదీపాలు ఏర్పాటూ చేయాలని సూచించారు. మంచినీటి సరఫరాలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. నర్సరీల నిర్వహణతో పాటు గ్రామాభివృద్ధిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో ఎంపీఓ రియాజొద్దిన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అందుబాటులో ఉండాలి

నర్సాపూర్ రూరల్: ప్రతీ గ్రామ కార్యదర్శి గ్రామాల్లో అందుబాటులో ఉండాలని నర్సాపూర్ ఎంపీఓ శ్రీనివాస్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షాకాలం కావడంతో గ్రామాల్లో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మురికి కాలువల నిర్వహణ, ఇంటింటికీ చెత్త బండ్లు తిప్పి చెత్త సేకరణతోపాటు వీధిలైట్ల ఏర్పాటు, నీటి సమస్య పరిష్కారం, ట్యాంకుల క్లోరినేషన్‌పై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ అంజిరెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తొలగించాలి

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని తహసీల్దార్ దత్తరెడ్డికి వినతిపత్రాన్ని అందజేసినట్లు బాధితుడు మహేశ్ మంగళవారం తెలిపారు. ప్రమాదకరంగా ఉన్నాయని, తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, నిర్మాణానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఇళ్ల పత్రాలు అందజేత

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం బర్దిపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాజమాన్య ధ్రువపత్రాలను మాజీ వైస్ ఎంపీపీ పట్లోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు.

డ్రగ్స్‌వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొల్చారం(నర్సాపూర్): ఆరోగ్యాన్ని చెడగొట్టి, శరీరాన్ని విచ్ఛిన్నం చేసే మత్తు పదార్థాలను దరిచేరనీయకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉందని సూచించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

నర్సాపూర్: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సకాలంలో చేపట్టాలని మండల ఎంపీఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలన్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, చెత్త వాహనాల ద్వారా చెత్తను తొలగించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాలకు అనుగుణంగా కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది విధులు చేపట్టాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శెట్టిపల్లి, కొత్తపల్లి, బండపోసాన్‌పల్లి, రామాయిపల్లి, ఏదులపల్లి, ఉప్పులింగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, శంకరయ్యగౌడ్, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు ధ్రువీకరణ పత్రాలను అందించడంతోపాటు భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నిరంజన్, మాజీ ఉపసర్పంచ్ కర్నే సాయిలు, రమేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు సెల్‌ఫోన్‌కి దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని షీ టీం అధికారి గంగామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష అన్నారు. మంగళవారం శివ్వంపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, సమాజంలో నడుచుకోవాల్సిన విషయాల గురించి షీ టీం, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరం



పాపన్నపేట(మెదక్): మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజు

సీఐ జాన్‌రెడ్డి పిలుపు

నర్సాపూర్ రూరల్: మత్తును కలిగించే మాదక ద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యపానం, ధూమపానం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతీ విద్యార్థి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషాచారి, ఎస్సై లింగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, కవిత, బాలల పరిరక్షణ కోఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న, అటవీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు ఓ మహమ్మారి.. చిత్తవ్వొద్దు

పాపన్నపేట(మెదక్): మత్తు ఓ మహమ్మారి అని, అలవాటుపడితే బతుకులు చిత్తవుతాయని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డ్రగ్స్, మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలు విష్ణువర్ధన్, నూమన్, అన్వికప్రియకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు, హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, మేగ్యా, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

శివ్వంపేట(నర్సాపూర్): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి అన్నా రు. శివ్వంపేటలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని ఫోన్ నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ప్రధాన కూడల్లో వాల్‌పోస్టర్లు ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని చెప్పారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలు వినియోగించడం వలన కలిగే అనర్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల ఆకర్షితులు కావొద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కౌడిపల్లి(నర్సాపూర్)లో...

కౌడిపల్లి(నర్సాపూర్):విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ..మత్తుపదార్థాలు, చెడు వ్యసనాల వల్ల ఆరోగ్యం పాడవడంతోపాటు ఆర్థికంగా నష్టపోతారని సమాజంలో చెడ్డ పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు.. పర్యావరణానికి తూట్లు



సంగాయిపేట పెద్ద చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేసిన స్థానికులు

కొల్చారం(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకం ఎప్పటిలాగే కొనసాగుతోంది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలను చెరువులు, కుంటలకు చేరుతుండటంతో కలుషితమవుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని,ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థాయిలో నిర్మించిన డంపు యార్డులకు తీసుకెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి గ్రామీణస్థాయిలో పర్యావరణాన్ని పరిరక్షించాలన్న లక్ష్యం ఏమాత్రం నెరవేరడం లేదు. ప్రస్తుతం మండలంలో చాలా చెరువులు,కుంటలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మత్స్య సంపద పెరగకపోవడం, మూగజీవాలు దాహార్తిని తీర్చుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా సంబురాలు



నిజాంపేటలో రైతు భరోసా సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు, రైతు భరోసా సంబురాలు ఘనంగా నిర్వహించారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. అలాగే సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయా రైతు వేదికల్లో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ మేరకు పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ రూ. 2 లక్షల రుణమాఫీ, ఉచితంగా బస్సు ప్రయాణం.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మించి ఇస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.



రేగోడ్: రైతు భరోసా సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, రైతులు



పెద్దశంకరంపేటలో వీసీకి హాజరైన రైతులు, అధికారులు